క్లుప్తంగా

వాసవి క్లబ్ మండలశాఖ నూతన కార్యవర్గం



అచ్చంపేట: వాసవి క్లబ్ మండలశాఖ అధ్యక్షుడిగా వీరవల్ల లక్ష్మీ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్థానిక శ్రీసీతారామ దేవాలయంలో క్లబ్ సభ్యులు మంగళవారం సమావేశమయ్యారు. కార్యదర్శిగా భవిరిశెట్టి రవికుమార్, ట్రెజరర్‌గా కొత్తమాసు శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా క్లబ్ జిల్లా అధ్యక్షుడు కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు. క్లబ్ జిల్లా వైస్ చైర్మన్ సూరే వెంకట కోటిలింగం, క్యాబినెట్ ట్రెజరర్ తువ్వా నాగమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషిచేయాలి



క్రోసూరు: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, ఆ లక్ష్యసాధన దిశగా సాగాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా క్రోసూరుకి విచ్చేసిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు సోమవారం స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా లక్ష్మణరావును హెచ్‌ఎం సిస్టర్ మేరీ రజిత శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి నిక్ వుజిసిక్‌ను ప్రేరణగా తీసుకోవాలని, లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆత్మ విశ్వాసంతో కష్టపడి ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రేరణనిచ్చారు. ఉపాధ్యాయులు, యుటీఎఫ్ నాయకులు శౌరెడ్డి, బాలశౌరెడ్డి, గోవింద్ రెడ్డి, లక్ష్మణ్, ప్రకాష్ విజయ్, బురాన్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్న సంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో క్రోసూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విప్పల వెంకట్రామిరెడ్డి, సుమలతలు మంగళవారం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు ప్రతి ఒక్కరు చేయూతను అందించాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గార్లపాటి ప్రభాకర్, పాఠశాల నిర్వాహకుడు కిషోర్ బాబు, తదితరులు ఉన్నారు.

గంగమ్మతల్లి ఆదాయం రూ.5.12 లక్షలు



అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో ఈ నెల 24, 25 తేదీలలో జరిగిన స్వయంభు గంగాదేవి పేరంటాళ్లమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవంలో భక్తులు హుండీలో కానుకల రూపంలో రూ.2,74,077లను సమర్పించినట్లు దేవదాయ ముఖ్య కార్య నిర్వహణాధికారి జి.రామకోటిరెడ్డి తెలిపారు. మంగళవారం హుండీ కానుకలను లెక్కించడం జరిగిందన్నారు. భక్తులు చదివింపుల రూపంలో మరో రూ. 2,38,404 ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం దేవాలయానికి తిరునాళ్ల ఆదాయం రూ. 5,12,481లు వచ్చిందన్నారు. ఈ మొత్తం గత యేడాదికంటే రూ.25వేలు ఎక్కువన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి, దేవస్థాన కమిటీ చైర్మన్ పూల పెద్ద హనుమయ్య, వైస్ చైర్మన్ జి.కోటిరెడ్డి, అర్చకులు ఎనుముల ఆంజనేయులు, ఎనుముల సాంబయ్య, ఎనుముల వెంకటేశ్వర్లు, చండీపారాయణ అవధాని మేడేపల్లి అప్పయ్యశాస్త్రి పాల్గొన్నారు.

మార్చి 25న మెగా బైబిల్ క్విజ్ పోటీలు

మాచర్ల: మాచర్ల నియోజకవర్గంలోని పట్టణంలో బేతేలు ప్రార్థనా మందిరంలో మార్చి 25వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో మెగా బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు మంగళవారం పోటీల నిర్వాహకులు పాస్టర్ బ్రహ్మానాయుడు తెలిపారు. యువతలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించటంతో పాటు క్రైస్తవ విశ్వాసుల్లో బైబిల్ పరిజ్ఞానం పెంచేందుకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అపోస్తుల కార్యములు, ఫిలిప్పి పత్రిక అనే పుస్తకంపై ఈ క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9848343195ను సంప్రదించాలని కోరారు.

సిద్ధం సభ విజయవంతం చేద్దాం

- నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలిరావాలి
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- నాయకులతో సన్నాహక సమావేశం



అమరావతిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాపట్ల జిల్లా మేదరమెట్లలో తలపెట్టిన సిద్ధం సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. సిద్ధం బహిరంగ సభ ఏర్పాట్లలో భాగంగా పెదకూరపాడులో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే జనసమీకరణ ఏర్పాట్లపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. మేదరమెట్ల వద్ద జరిగే సిద్ధం సభకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన మూడు సిద్ధం సభలతో రాష్ట్రంలో ఫ్యానుగాలికి ఎదురులేదని స్పష్టమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జనసంద్రంగా మారుతున్న సిద్ధం సభలతో ప్రతిపక్షాలకు వణుకు పుడుతుందన్నారు. ప్రజల కోసం శ్రమించే నాయకుడు ప్రజల్లోకి వస్తే అభిమానం ఎలా ఉంటుందో అందరూ ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న అభిమానంతోనే సిద్ధం సభలు విజయవంతమవుతున్నాయన్నారు. ప్రతిపక్షాలకు సభలు గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబశిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ షేక్ బాషా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, జేసీఎస్ కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపాటి యోహాను, కంకణాల శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలిరండి...

అమరావతి: ప్రకాశం జిల్లా మేదరమెట్ల దగ్గర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన సిద్ధం బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం సిద్ధం బహిరంగ సభ ఏర్పాట్లపై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం జగన్ సిద్ధం సభల దెబ్బకు యువగళం, వారాహి యాత్రలు అన్నీ మూలన పడ్డాయన్నారు. రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌ను తమ గుండెల్లో పెట్టుకున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. మార్చి 3వ తేదీన జరిగే సిద్ధం నాలుగో సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. సిద్ధం సభకు గుంటూరు, ప్రకాశం,నెల్లూరు జిల్లాల నుంచి సుమారు 15 లక్షల మందికి పైగా వస్తారన్న అంచనాలకు తగ్గట్టుగా జనసమీకరణ ఉండాలన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కోట హరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, గ్రామ సర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు, ఆళ్ల శ్రీనివాసరెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీలో చేరిన మాదిపాడుకు చెందిన టీడీపీ మైనార్టీ నేతలు



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



పాపాయపాలెంలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సతీమణి నంబూరు వసంతకుమారి

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు గ్రామంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన మరో ఇద్దరు టీడీపీ నేతలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. మంగళవారు మాదిపాడుకు చెందిన షేక్ జాన్‌సైదా, షేక్ లాలు తమ అనుచరుతో క్రోసూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి తరలి వెళ్లి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ టీడీపీపై వారి పార్టీనేతల్లో సైతం రోజు రోజుకు నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. అందువల్లే ఆ పార్టీలో ఎంతో కాలంలో ఉన్నవారు సైతం వైఎస్సార్ సీపీలోకి స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన జాన్‌సైదా, లాలూ మాట్లాడుతూ మైనారిటీలకు వైఎస్సార్ సీపీలోనే మేలు చేకూరిందని, పార్టీలు కూడా చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అన్ని వర్గాలవారికి చేరవేస్తున్నారని అందువల్లే తాము వైఎస్సార్ సీపీలో చేరామని తెలిపారు. ఎన్నికల నాటికి మైనార్టీలు మొత్తం వైఎస్సార్ సీపీలో చేరతారని, టీడీపీలో ఒక్కరూ కూడా మిగలరని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్ నాయక్, పెద జాన్‌సైదా తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీకి చెందిన 15 కుటుంబాలు...

బెల్లంకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అన్నివర్గాల మెప్పు పొందుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన 15 కుటుంబాలకు చెందిన 50 మంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో వసంతకుమారి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కుచ్చపు రామయ్య, పద్మ, బత్తుల భిక్షం, బత్తుల దుర్గ, సాధికుమారి, చల్లా త్రివేణి, నీలవతి, కోటేశ్వరరావు, వెంకట్రావు, ఓర్సు శ్రీను, మహాలక్ష్మీ, అశ్విని, ఓర్సు గోపి, తిరుపతమ్మ, సంధ్య, శంకరం, మీనాక్షి, చల్లా కోటేశ్వరి తదితర కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శంకరరావు చేస్తున్న కృషికి ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు తెలిపారు. వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యేగా శంకరరావు, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు అక్కల వెంకట్రామిరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు మర్రి అనంతరామిరెడ్డి, పుణ్యాల వెంకటేశ్వరరెడ్డి, బత్తుల లక్ష్మయ్య, శివయ్య, మేళం వెంకటేశ్వర్లు, మర్రి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతోమేలు

- జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి
- చెరుకుపాలెంలో సురక్ష వైద్యశిబిరం



రోగులకు జగనన్న సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి



రుద్రవరంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ రవీంద్ర రత్నాకర్

అచ్చంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వ్యాధులనుంచి విముక్తి పొందవచ్చని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెరుకుపాలెంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఇన్నారావు, డాక్టర్ సుమిత్ర, డాక్టర్ సుస్మితలు 375మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 13 మంది చిన్నారులతోపాటు, 109 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 100మందిని కంటి అద్దాలకు ఎంపిక చేశారు. షుగర్, బీపీ, నిమోనియా తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసి, జగనన్న మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని వ్యాధులనుంచి విముక్తి పొందాలని తెలిపారు. సర్పంచ్ చింతగుంట్ల హనుమంతరెడ్డి, ఎంపీటీసీ సుంకర సీతమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకటరావు, హెచ్ఎస్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి బి.శివయ్య, ఎంఎల్‌హెచ్‌పీ మహేష్, లలిత, రోజారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లులో...

నకరికల్లు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ఎందరికో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచ్ అలపర్తి కృష్ణకుమారి అన్నారు. మండలంలోని చాగల్లు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి బి.భాస్కరరావు మాట్లాడుతూ 251 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. సచివాలయం కార్యదర్శి సత్యనారాయణ, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ బి.రఘుప్రసాద్, డాక్టర్ లక్ష్మీవిజయ, కాండ్రు భిక్షమయ్య, టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ డైరెక్టర్ అలపర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో...

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం జరిగింది. శిబిరంలో 327 మందికి వైద్యసేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యుడు నజీర్ తెలిపారు. పలు విభాగాలలో నిపుణులైన వైద్యులు విశ్వనాథరెడ్డి (జనరల్ సర్జన్), ధర్మా నాయక్(ఆర్థోపెడిక్)లు పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు. కంటి వైద్య నిపుణుడు మధుబాబు కంటిపరీక్షలు నిర్వహించారు. 135 మందికి కళ్లఅద్దాలు అవసరమున్నట్లుగా గుర్తించారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన టీకాలు అందించారు. శిబిరాన్ని ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ రవీంద్రరత్నాకర్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కళ్ళం వీరభాస్కరరెడ్డి, సూపర్‌వైజర్‌లు పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుకూరులో...

అందుకూరు(క్రోసూరు): మండలంలోని అందుకూరు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 354 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ డీఎస్ రమాదేవి, గైనికాలజిస్ట్ డాక్టర్ కౌసల్య, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ రమణ, ఈఓపీఆర్డీ శివరామయ్య సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఈనెల 28న మధ్యాహ్నం 12 గంటలకు పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో అజెండాలోని అన్నిఅంశాలపై చర్చించి ఆమోదించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యులుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సత్తెనపల్లి: ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని 29వ వార్డుకు చెందిన షేక్ మస్తానవలి, షేక్ రహమతున్ దంపతులు హోటల్ నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తుంటారు. అప్పులు పెరగడంతో భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో రహమతున్ పెట్రోల్ పోసుకొని ఈ నెల 21న ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



నరసరావుపేట ఈస్ట్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈనెల 28న సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు విద్యార్థులకు సైన్స్ రంగంలో క్విజ్, వకృత్వం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. పోటీలలో జెడ్పీ హైస్కూల్ (తూబాడు) ప్రథమ, జెడ్పీ హైస్కూల్ (శంకరభారతీపురం) ద్వితీయ, జెడ్పీ హైస్కూల్ (పాలపాడు) తృతీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్, సైన్స్ ఉపాధ్యాయులు ఓ.సాంబయ్య, కె.చిట్టెమ్మ, బీవీహైచ్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

దుర్గి: మూడు రోజుల క్రితం మండలంలోని అడిగొప్పల గ్రామానికి చెందిన వ్యక్తి గుంటూరు జనరల్ హాస్పిటల్‌లో మృతి చెందినట్లు దుర్గి ఎస్ఐ ఎస్.కోటయ్య మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం అడిగొప్పల గ్రామానికి చెందిన కె.కుమారస్వామి (50) అనే వ్యక్తి గుంటూరు జనరల్ హాస్పిటల్‌లో మూడు రోజుల క్రితం జాయిన్ అయ్యాడని మరుసటి రోజు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అడిగొప్పల గ్రామంలో విచారించినా ఆచూకీ లేదన్నారు. తెల్లచొక్కా, బ్లూ కలర్ లుంగీ ధరించాడన్నారు. మృతుని గుర్తించిన వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హై లెవల్ బ్రిడ్జి పనులు వేగవంతం

- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- పెద్దమద్దూరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మండల పరిధిలోని పెద్దమద్దూరు వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ అమరావతి నుంచి తుళ్లూరు డబుల్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా పెద్దమద్దూరు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని భావించి పనులు మొదలుపెట్టామన్నారు. ఈ బ్రిడ్జికి కావాల్సిన ఐదు ప్రధాన పిల్లర్లలో ఐదూ పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు మరింత వేగవంతంగా చేయటానికి ఏర్పాట్లు చేయాలని కాంట్రాక్టర్‌లు, అధికారులను ఆదేశించామన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

సత్తెనపల్లి పీపీ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ అనూష



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అనూష, డాక్టర్ ధర్మ, కొత్త రామకృష్ణ, చల్లా రత్తయ్య

సత్తెనపల్లి: పోలియో రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సత్తెనపల్లి పీపీ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ అనూష కోరారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలోని పీపీ యూనిట్‌లో ఈ నెల 3వ తేదీన చేపట్టనున్న పల్స్ పోలియోకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ పోలియో డ్రాప్స్ వేయించాలన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లి, తండ్రి బాధ్యతగా ఐదు సంవత్సరాలలో తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. 31 వార్డుల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని, అందుబాటులో ఉన్న కేంద్రంలో డ్రాప్స్ వేయించుకోవాల్సిందిగా కోరారు. పల్స్ పోలియోలో నిమగ్నమయ్యే సిబ్బంది సుమారు 250 మందికి పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ (మార్కెట్ యార్డు) వైద్యుడు డాక్టర్ ధర్మ, సాయిబాబా సేవ సమాజం అధ్యక్షుడు చల్లా రత్తయ్య, తదితరులు ఉన్నారు.

‘పల్స్ పోలియో’ విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు

బెల్లంకొండ: మార్చి 3వ తేదీ నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేవీ కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందికి పల్స్ పోలియోపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5 ఏళ్ల లోపు వయస్సు గల చిన్నారులు మొత్తం 2037 మంది ఉన్నట్లు తెలిపారు. 10 గ్రామ సచివాలయ పరిధిలో 25 పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 100 శాతం మందికి పోలియో చుక్కలు వేసేవిధంగా బూత్‌లెవల్ మెంబర్స్, రూట్ సూపర్‌వైజర్‌లకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ స్వర్ణకుమారి, వైద్య ఆరోగ్య సిబ్బంది, వివిధ గ్రామాల అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని సంగండైరీ సభ్యుడు దగ్గుబాటి యోగేశ్వరరావు ఈ ఏడాది జనవరి 24వ తేదీన మృతి చెందాడు. సహజ మరణం పొందిన పాడిరైతుకు బీమా పథకం వర్తించింది. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో రూ.50 వేల బీమా చెక్కును నరసరావుపేట సంగం డైరీ డైరెక్టర్ కట్టా జగన్‌మోహన్‌రావు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డైరీ మేనేజర్ తేలప్రోలు వీరేంద్ర కుమార్, తిమ్మాపురం పాలకేంద్రం అధ్యక్షుడు పావులూరి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు ఎలికా రాఘవులు, పిచ్చియ్య తదితరులు ఉన్నారు.

ఎన్నికల రిసెప్షన్ కౌంటర్‌కు గదుల పరిశీలన



శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళీకృష్ణ

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ ముందు రోజు సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందించేందుకు అవసరమైన రిసెప్షన్ కౌంటర్‌ను ఏర్పాటు చేసేందుకు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల, హోలీ ఫ్యామిలీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాలను మంగళవారం సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి వి.మురళీకృష్ణ పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో ఎన్నికల సామగ్రి ఏర్పాటుకు అనువైన గదులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయనతోపాటు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే విజయ్‌కుమార్ తహసీల్దార్ సీహెచ్ ఉష, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ ఆదినారాయణ, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్ బాబు, తదితరులు ఉన్నారు.

వైపరీత్యాలకు ప్రత్యామ్నాయం ప్రకృతి విధానమే

డీపీఎం కె.అమలకుమారి



చెంఘీజ్ ఖాన్ పేటలో ఆకుకూరల సాగును పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి

యడ్లపాడు: ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటల రక్షణకు ప్రత్యామ్నాయం ప్రకృతి వ్యవసాయమేనని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని ప్రకృతి విధానంతో సాగైన పంటల్ని పరిశీలించారు. సంగం గోపాలపురం సమీపంలో ప్రసన్నాంజనేయ స్వామి గుడి ఎదురుగా సాగు చేస్తున్న రైతు రామకృష్ణ పొలాన్ని సందర్శించి సాగు వివరాలు, ఎదురవుతున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రకృతి సాగు విధానంపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రామకృష్ణ అనే రైతు ఇక్కడ ఎకరం భూమిలో ప్రకృతి సేద్యం చేస్తున్నాడన్నారు. అయితే ఆ భూమిలో 10 సెంట్లలో ప్రత్యేక బెడ్లను వేసి అందులో రకరకాల ఆకుకూరల సాగుకు శ్రీకారం చుట్టాడని తెలిపారు. ఈ సాగుకు రసాయనిక, పురుగు మందుల్ని కాకుండా పూర్తిగా ప్రకృతి విధానంతోనే బీజామృతం, ఘన జీవామృతం వంటి వాటిని వినియోగిస్తూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి నాణ్యమైన ఉత్పత్తుల్ని సాధిస్తున్నాడని వివరించారు. బెడ్లపై ఒకభాగంలో సాగు చేసిన పంట పూర్తికాగానే తిరిగి అదే భాగంలో పంటమార్పు చేయడంతో దిగుబడి తగ్గే అవకాశం లేదన్నారు. ప్రకృతి విధానంతో సాగు చేసిన పంటలు ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇస్తాయన్నారు.

దర్గాలో అనిల్‌కుమార్ యాదవ్ ప్రత్యేక ప్రార్థనలు



ముప్పాళ్ల దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనిల్‌కుమార్ యాదవ్

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్లలోని పోతవరం బాబా దర్గాను వైఎస్సార్ సీపీ లోక్‌సభ సమన్వయకర్త పి.అనిల్‌కుమార్ యాదవ్ మంగళవారం సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ రహంతుల్లా, కో–ఆప్షన్ సభ్యుడు అబ్జర్‌వలీ, జానీబాషా, అహ్మద్ హుస్సేన్, జనత్‌హుస్సేన్‌లు పాల్గొన్నారు. తొలుత ముప్పాళ్లలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కాసేపు ముచ్చటించారు. చాగంటివారిపాలెంలోనూ వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి టీ తాగారు. నాయకులు రెండెద్దుల వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, బ్రహ్మారెడ్డి, మధిర వెంకటేశ్వర్‌రెడ్డి, కనకం తదితరులు పాల్గొన్నారు.